www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 జనవరి 2023 | 5 | పశ్చిమ గోదావరి

గోదారోళ్ల ఆతిథ్యం.. ఆర్భాటం

కొత్త అల్లుడికి 173 రకాల వంటకాలతో విందు

భీమవరం రూరల్: గోదావరి జిల్లాలు అంటే అతిథి మర్యాదలకు పెట్టింది పేరు. అసలే సంక్రాంతి.. ఆపై కొత్త అల్లుడు అత్తారింటికి భీమవరం వస్తే చేసే మర్యాదలు అంతాఇంతా కాదు. ఇదే తరహాలో పండుగకు అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుడికి ఏకంగా 173 రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేశారు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తటవర్తి బద్రి, సంధ్య దంపతులు. వారు తమ అల్లుడు చవల పృథ్వీగుప్తా (హైదరాబాద్), హారిక దంపతులకు పండుగ సందర్భంగా శనివారం 173 రకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేశారు. ఆర్భాటంతో కూడిన అతిథ్యాన్ని చూసి అంతా ఔరా అంటున్నారు.

బరి తెగింపు...!

- యథేచ్ఛగా కోడి పందేలు.. ఎంఎల్ఎలే ప్రారంభోత్సవాలు
- కోర్టు ఆదేశాలు తుంగలోకి.. చేతులెత్తేసిన పోలీసులు
- విచ్చలవిడిగా గుండాట, మూడు ముక్కలాట
- ప్రతి మండలంలోనూ పదికిపైగా బరుల్లో పందేలు జోరు
- దుంపగడప బరిలో బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్
- ప్రతి పోలీస్ స్టేషన్‌కూ రూ.ఏడెనిమిది లక్షలు మామూళ్లు?

కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కారు.. ప్రతియేటా మాదిరిగానే ఈసారి బరి తెగించి మరీ రెండు జిల్లాల్లోనూ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. అడ్డుకుంటామని బీరాలు పలికిన పోలీసులు ప్రభుత్వ అనధికార ఆదేశాలతో ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. దీంతో రెండు జిల్లాల్లోనూ 400కుపైగా బరుల్లో శనివారం భోగి రోజు కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. పలుచోట్ల ఎంఎల్ఎలే పందేలను ప్రారంభించిన పరిస్థితి ఉంది. తొలిరోజు రూ.కోట్ల సొమ్ము బెట్టింగుల రూపంలో చేతులు మారింది. గుండాట, మూడు ముక్కలాటలు విచ్చలవిడిగా కొనసాగాయి. అత్యధిక పందేలు గెలిచిన వారికి బైక్‌లు బహుమతులుగా ప్రకటించిన తీరు పందేల జోరుకు అద్దం పడుతోంది.

ఎంఎల్ఎ రామరాజు, మాజీ సీసలిలో ఎంఎల్ఎ శివ

కాళ్ల మండలంలో సీసలి బరి వద్ద బారులు తీరిన కారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా కోడి పందేలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పందేలను అడ్డుకోవాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా అడ్డుకోవాల్సిన పోలీసులు పండుగ మూడు రోజులు ప్రేక్షక పాత్రకు పరిమితమై మామూళ్ల లెక్కలు చూసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రతియేటా మాదిరిగానే ఈ సంక్రాంతి పండుగ సైతం జూద క్రీడలకు వేదికగా మారింది. శుక్రవారం సాయంత్రం వరకూ కోడి పందేలను అడ్డుకుంటామని పోలీసులు బీరాలు పలికారు. శనివారం భోగిరోజు ప్రభుత్వ అనధికార ఆదేశాలతో పోలీసులు చేతులెత్తేశారు. దీంతో మరోసారి పందెంరాయుళ్లు పైచేయి సాధించారు. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో తొలిరోజు భోగి పండుగ నాడు యథేచ్ఛగా కోడిపందేలు సాగాయి. ప్రతి మండలంలోనూ పదికిపైగా బరుల్లో పందేలు సాగిన పరిస్థితి నెలకొంది. భీమవరం మండలం గొల్లవానితిప్పరోడ్డులో దేగాపురం, పాలకొల్లు బైపాస్ పక్కన, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, దేవులపల్లి, పెదవేగి మండలంలో కొండలరావుపాలెం, దెందులూరు మండలం శ్రీరామవరం, ఆకివీడు మండలం దుంపగడప, కైకలూరు మండలం ఆలపాడు, కాళ్ల మండలం సీసలిలో భారీస్థాయిలో కోడిపందేలు కొనసాగుతున్నాయి.



ఆకివీడు మండలం దుంపగడపలో తొమ్మిది పందేలకుగాను ఐదు పందేలు గెలిచిన వారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ బహుమతిగా ప్రకటించడంతోపాటు బరి వద్ద ప్రదర్శనగా పెట్టడం గమనార్హం. సీసలిలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు, పాలకొల్లులో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, బుట్టాయిగూడెం మండలం దుద్దుకురూరులో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు ఎంఎల్ఎ అబ్బాయిచౌదరి పాల్గొని పందేలను ప్రారంభించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు కోడిపందేల్లో కీలక పాత్ర పోషించారు. దేగాపురం పందేలకు యువ సినీ హీరో కిరణ్ అబ్బవరం హాజరయ్యారు.

తొలి రోజు రూ.50 కోట్లు మేర బెట్టింగ్..?

భోగి రోజు శనివారం కోడి పందేల్లో రూ.50 కోట్లకుపైగా బెట్టింగ్ జరిగినట్లు అంచనా వేస్తున్నారు. పెద్దబరుల్లో ఒక్కో పందేనికి రూ.ఐదు నుంచి రూ.పది లక్షల వరకూ పందేలు సాగాయి. గుండాట, మూడు ముక్కలాటల్లో పెద్దఎత్తున సొమ్ము చేతులు మారింది. రెండో రోజు ఆదివారం పెద్దపండుగ రోజు పందేల జోరు మరింత ఉధృతంగా సాగనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. పందేలకు యువత, సామాన్య ప్రజానీకం ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. బరుల ప్రాంతాలన్నీ జాతరను తలపిస్తున్నాయి. రాత్రిపూట సైతం యథేచ్ఛగా పందేలు సాగేందుకు ఫ్లడ్‌లైట్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. పెద్దపెద్ద బరుల వద్ద ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో బౌన్సర్లను నియమించారు.



పాలకొల్లులో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి మండలంలో గుండాట

ప్రతి స్టేషన్‌కూ రూ.ఏడెనిమిది లక్షలు మామూళ్లు

పందేలు నిరాటంకంగా సాగేందుకు, పోలీసుల నుంచి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు పందేల నిర్వాహకులు పోలీసులకు పెద్దఎత్తున మామూళ్లు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. బరుల ప్రాతిపదికన రూ.30 వేల నుంచి రూ.లక్షకుపైగా మామూళ్లు ఇచ్చినట్లు సమాచారం. ప్రతి పోలీస్ స్టేషన్‌కు మామూళ్ల రూపంలో రూ.ఏడెనిమిది లక్షలు అందినట్లు తెలుస్తోంది. గుండాట, మూడు ముక్కలాట నిర్వాహకుల నుంచి కూడా పోలీసులకు పెద్దఎత్తున మామూళ్లు ముట్టినట్లు ప్రచారం సాగుతోంది. భోగిరోజు మధ్యాహ్నం నుంచి గుండాట, మూడు ముక్కలాటలు నిలుపుదల చేయాలని పైనుంచి పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే మామూళ్లు అందుకోవడంతో పెద్దగా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పండుగ మూడు రోజులు పందేల రూపంలో రూ.కోట్లు చేతులు మారే పరిస్థితి కన్పిస్తోంది. వేలాది మూగజీవాలు బరిలో ప్రాణాలు వదలనున్నాయి.

జిఓ 1 బూడిద కావాల్సిందే

పౌరహక్కులు, ప్రజాసంఘాలు, వామపక్షాలు, టిడిపి ఆధ్వర్యాన భోగి మంటల్లో జిఓ ప్రతులు

రోడ్ షోలు, సమావేశాలు, బహిరంగ సభలపై నిర్బంధం, ఆంక్షలు విధిస్తూ పౌరహక్కులకు భంగం వాటిల్లేలా జారీ చేసిన జిఓ 1ని రద్దు చేయాలని కోరుతూ శనివారం జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. భోగి మంటల్లో జిఓ కాపీలను వేసి దహనం చేశారు. పౌరహక్కులు, ప్రజా సంఘాలు, సిపిఎం, సిపిఐ, టిడిపి ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు సాగాయి.

తణుకులో..

ప్రజాశక్తి - యంత్రాంగం

జిఓ నెం.1 ప్రతులను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో **తణుకు**లో వివిధ ప్రజాసంఘాలు భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు తాతపూడి మారుతీరావు, కాంగ్రెస్ నేత దిరిసిపో రామకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, జనసేన నాయకుడు అనుకుల రమేష్, మైనార్టీ సంఘం నేత మహ్మద్ అబ్దుల్ రహీం సయ్యద్ సాదిక్, సిఐటియు నేత టి.వెంకటేశ్వర్లు, న్యాయవాది ధనాల అప్పారావు పాల్గొన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మండలంలోని వేల్పూరు గ్రామంలో పదో వార్డులో భోగి మంటల్లో జిఓ 1 కాపీలు వేసి దహనం చేశారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చినవీరభద్రరావు మాట్లాడారు. **పాలకొల్లు** పట్టణంలో పలుచోట్ల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం భోగి మంటల్లో ఆ జిఓ ప్రతులను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం నాయకులు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జవ్వాది శ్రీనివాస్, గుబ్బల సత్యనారాయణ, వలవల శ్రీరామూర్తి, చల్లా సోమేశ్వరరావు, అజయ్ కుమార్, వై.కృష్ణారావు, బాసిన శ్యామల పాల్గొన్నారు. **తాడేపల్లిగూడెంలో** బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన భోగి మంటల్లో జిఓ1 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. భాగ్యలక్ష్మీపేట, సీతారాంపేట, రామచంద్రరావుపేట, యాగర్లపల్లి, నవ్వారుపేట, అపరాలు మార్కెట్, చింతపండు మార్కెట్, పండ్ల మార్కెట్, కూరగాయలు మార్కెట్, యార్డు మార్కెట్, ఎరువుల మార్కెట్‌లలోనూ సిఐటియు ఆధ్వర్యాన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమాల్లో జి.నాగేశ్వర రావు, రాము, పెద్దిరాజు, కె.ఉదయ్‌కుమార్, పైడియ్య, శ్రీనివాస్, ఎస్.శేషుబాబు, నాగేంద్ర బాబు, అప్పారావు, రామ్మోహన్‌రావు, నారాయణ రావు పాల్గొన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యాన పట్టణంలో వివిధ కేంద్రాల్లో జిఓ1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియు నేతలు డి.సోమసుందర్, తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడారు. సిఐటియు ఆధ్వర్యాన నరసాపురం లోని మొగల్తూరు రోడ్లో ఆంజనేయస్వామి గుడి వద్ద భోగిమంటల్లో జిఓ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము మాట్లాడారు. **పెనుమంట్ర** మండలం బ్రాహ్మణచెర్వు, పొలమూరుల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యాన భోగి మంటల్లో జిఓ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మజ, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.మావో, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బి.విజయ్ కుమార్, సంఘాల నేతలు సిహెచ్.లక్ష్మికుమారి, కె.ప్రసాద్ పాల్గొన్నారు. **వీరవాసరం:** మండలం నవుడూరు సెంటర్‌లో జిఓ 1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడగా యాళ్లబండి నారాయణమూర్తి, మైగాపుల రాంబాబు, బొంతు రామారావు, బలుసుపల్లి నూకరాజు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు. **పాలకోడేరు** మండలంలోని పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు, శృంగవృక్షం, వేంద్ర, పాలకోడేరు, గొల్లలకోడేరు, కుముదవల్లి, మోగల్లు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జిఓ నెం.1 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిలా నేత అసిరియ్య మాట్లాడారు. **మొగల్తూరు**లో సిఐటియు ఆధ్వర్యాన భోగి మంటల్లో జిఓ 1 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, యడ్ల చిట్టిబాబు, పాల్గొన్నారు.

యలమంచిలి మండలంలో

ఉండిలో..

పాలకొల్లులో..

సిపిఎం ఆధ్వర్యాన..

రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు, ప్రధాన కూడళ్లలో సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణపై నిషేధం విధిస్తూ తీసుకొచ్చిన జిఓ నెం.1ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం **తణుకు** పట్టణంలో భోగి మంటల్లో సిపిఎం ఆధ్వర్యాన జిఓ నెం.1 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నేతలు గార రంగారావు, గుబ్బల గోపి, సురేష్, నాగేంద్ర, వెంకాయమ్మ పాల్గొన్నారు. **ఆచంట** మండలంలోని కొత్తూరు సెంటర్, పెనుమంచిలి, వల్లూరు సెంటర్లలో సిపిఎం ఆధ్వర్యాన జిఓ నెం.1 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నేతలు వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ మాట్లాడగా సిర్రా నర్సింహమూర్తి, కుసుమే జయరాజు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, తోటపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **భీమవరం** పట్టణంలోని బొక్కావారిపాలెం, చినరంగనిపాలెం, వైఎస్ఆర్ కాలనీ, లంకపేట, దుర్గాపురం ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో జిఓ నెం.1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నేత ఎం.వైకుంఠరావు మాట్లాడగా వెంకటేశ్వరరావు, రాంబాబు, రత్నంరాజు, బొక్కా సత్యనారాయణ, శ్రీను, ధనలక్ష్మి పాల్గొన్నారు. **యలమంచిలి** మండలంలోని చించినాడలో ఆధ్వర్యంలో జిఓ 1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, మాచవరపు సుబ్బారావు, శ్రీనివాస్, మోహనరావు, జార్జిబాబు, ఏడుకొండలు, కేతా వాసు, రాము పాల్గొన్నారు. **పెనుగొండ**లో గాంధీబొమ్మల సెంటర్‌లో భోగి మంటల్లో జిఓ నెం.1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడగా షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, శీలం యేసు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన..

ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమిస్తున్న ప్రతిపక్షాల, ప్రజా సంఘాల గొంతు నొక్కేందుకే వైసిపి ప్రభుత్వం జిఓ నెం.1 తీసుకొచ్చిందని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యాన శనివారం **ఉండి**లో జిఓ 1 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో నేతలు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాం ప్రసాద్, సనపల శ్రీను, తమ్మరాని శ్రీనివాస్, కోన గొల్లయ్య, పతివాడ గణపతి, పున్నాని అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన..

జిఓ నెం.1ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ టిడిపి నేతలు **పాలకొల్లు** 28వ వార్డులో భోగి మంటల్లో ఆ జిఓ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడారు. టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు. **కాళ్ల** మండలం కలవపూడిలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు జిఓ 1 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో ముదుండి మణిబాబు పాల్గొన్నారు. **తణుకు**లో మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యాన ఆయన నివాసం వద్ద జిఓ నెం.1 ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్లు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, పరిమి వెంకన్నబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ పాల్గొన్నారు. **నరసాపురం** పట్టణంలో జిఓ 1 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడారు.

తాడేపల్లిగూడెంలో..



పెనుమంట్ర మండలంలో

ఏదీ నాటి సంక్రాంతి శోభ..!

ప్రభుత్వ విధానాలతో రైతన్న విలవిల
పండుగ అంటే పందేలుగా మార్పు

సంక్రాంతి అంటే పల్లెల్లో ఇంటిల్లపాది సందడే.. సార్వా పంట చేతికొచ్చి.. దాళ్వా సాగు సమయం కావడంతో ప్రత్యేకంగా రైతుల ఇంట సంక్రాంతి శోభ వెల్లివిరిసేది. ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కూలీలు, ఇతర చేతివృత్తిదారుల ఇంటా పండుగ సందడి ఉండేది. ఇది ఒకనాటి పరిస్థితి. ప్రస్తుతం పల్లె ముఖచిత్రం మారింది. ఫలితంగా సంక్రాంతి సందడి కోడిపందేల బరుల వద్ద తప్ప మిగిలిన చోట్ల పెద్దగా కానరాని పరిస్థితి నెలకొంది.

ఆరేడు ఏళ్ల క్రితం వరకూ రైతు రోడ్డెక్కడమంటే ధాన్యం ధర గురించో.. సాగునీటి కోసమో అయ్యేది. గిట్టుబాటు ధర అటుంచి కనీసం మద్దతు ధర ఇవ్వండంటూ రైతులు ఆందోళన చేయడం పరిపాటి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపరిహారం కోసం ఆందోళన చేపట్టాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంటే ఆ సమస్యలన్నీ పరిష్కారమై పోయాయని, అందువల్ల ఆయా అంశాల గురించి మాట్లాడటం లేదంటే పొరపాటే. అసలు పండించిన పంటే కొనని పరిస్థితుల్లో ఇక ధర గురించి మాట్లాడే పరిస్థితి ఎలా ఉంటుంది. ఇటీవల ఆచంట మండలంలో పలు గ్రామాల్లో కౌలు రైతులు ట్రాక్టర్లపై ధాన్యం లోడు చేసినా మిల్లులకు పంపేందుకు రైతుభరోసా కేంద్రం సిబ్బంది టార్గెట్ పూర్తయిపోయిందని చెప్పడమే దీనికి నిదర్శనం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సార్వా ధాన్యం అమ్మకాల్లో రైతులు నానావస్థలు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కొనుగోలు విధానం. ఇంతకుముందు ధాన్యం సొమ్ము కోసం పడిగాపులు పడే పరిస్థితి నుంచి తమ వద్ద నుంచి ధాన్యం మిల్లులకు ఎప్పుడు తీసుకెళ్తారనే పరిస్థితికి ఈ విధానం తీసుకొచ్చింది. ధాన్యం సొమ్ము కోసం పడిగాపులు పడటం అటుంచి తమ ధాన్యం ఎప్పుడు

కొంటారంటూ ఆర్‌బికెల వద్ద పడిగాపులు పడే దుస్థితి ఏర్పడింది. గత దాళ్వా సీజన్ వరకూ అమ్మిన ధాన్యం సొమ్ము కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. సార్వా ధాన్యం చేతికొచ్చే సమయానికి గత దాళ్వా ధాన్యం సొమ్ము కొంతమంది రైతులకు అందని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. తాజాగా కొత్త విధానంతో రైతులు ఆర్‌బికెల చుట్టూ ప్రదక్షిణలు తిరగడం, మిల్లుల వద్ద తేమ శాతం తేడాలతో సొమ్ము ఎదురు కట్టాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. దాళ్వా నాట్లు పూర్తయ్యే దశలోనూ రెండు జిల్లాల్లోనూ ధాన్యం అమ్మకాలు సాగుతుండటం రైతుల దయనీయ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఈ క్రమంలో ఇటు దాళ్వా పెట్టుబడులకు సొమ్ము లేక నానాఅవస్థలు పడుతున్న రైతుల ఇంట సంక్రాంతి శోభ ఎలా వస్తుందో ప్రభుత్వమే చెప్పాలి. ఇక జిల్లాలో ఆక్వా రైతుల పరిస్థితీ ఇబ్బందికరంగానే ఉంది. ధర సమస్యతోపాటు ఇతర సమస్యలు ఆక్వా రైతులను వెంటాడుతున్నాయి. పామాయిల్ రైతులు సాగు చేద్దామంటే మొక్కలు అందుబాటులో లేక, మిర్చి రైతులు తామర, నల్లి పురుగు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. అదే సమయంలో యంత్రాల రాక, వరిసాగు విస్తీర్ణం తగ్గడం తదితర కారణాల రీత్యా వ్యవసాయ కార్మికులు పనుల్లేక ఉపాధి కోసం పట్నం బాట పట్టి భవన నిర్మాణ కార్మికులుగా మారారు. పెరిగిన ధరలతో నిర్మాణ రంగం మందగించడంతో అక్కడా పనుల్లేని పరిస్థితుల్లో పేదల పరిస్థితి దయనీయంగా మారింది. దీనికితోడు ఆర్థిక మాంద్యం నీలినీడలు నేపథ్యంలో కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగుల తొలగింపునకు పూనుకోవడం, కొత్తగా ఉపాధి అవకాశాలు పెద్దగా లభించకపోవడంతో సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన వారు పండుగకు సొంతూళ్లకు చేరుకున్నా గతంలో ఉన్నటువంటి హుషారు లేదు. మొత్తంగా ప్రభుత్వ విధానాల ఫలితంగా జిల్లాలో కోడిపందేల వద్ద తప్ప మిగిలిన చోట్ల సంక్రాంతి శోభ పెద్దగా కానరాని పరిస్థితి ఉంది.

పండుగ అంటే పందేలేనా..!

జిల్లాలో సంక్రాంతి అంటే పిండి వంటలు, కొత్త బట్టలు, డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, ఇళ్ల ముంగిట రంగవల్లులు వంటి సందడి పక్కకుపోయి కోడిపందేలే అనే పరిస్థితి కన్పిస్తోంది. భోగి రోజున భోగి మంటల దగ్గర నుంచి కొత్త బట్టలు వంటి హడావుడి పెద్దగా కానరాని పరిస్థితి ఉంది. అయితే ఏదెలాగున్నా పండుగ సందడి మాత్రం కోడి పందేల బరుల వద్ద కన్పించింది. గతంలో మాదిరి భోగి రోజు మధ్యాహ్నం వరకూ కూడా ఆగాల్సిన అవసరం లేకుండానే ఉదయం నుంచే పందేలు ప్రారంభం కావడంతో పందెంరాయుళ్లు, యువత అటువైపు పరుగులు తీశారు. తమ విధానాలతో రైతుకూలీలకు, పేదలకు, చేతివృత్తిదారులకు, చిన్నవ్యాపారులకు పండుగను దూరం చేసిన ప్రభుత్వం కోడిపందేల విషయంలో మాత్రం గత ప్రభుత్వానికి తీసిపోమన్నట్లు వ్యవహరించిందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

సమాజంలో మార్పే లక్ష్యం

క్రీడా పోటీల ప్రారంభ సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము

ప్రజాశక్తి - ఆకివీడు



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్

సమాజంలో మార్పే తమ లక్ష్యమని, ఆ లక్ష్య సాధన కోసం తాము కృషి చేస్తున్నామని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము అన్నారు. డివైఎఫ్ఐ ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. తొలుత ఆయన సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యువజనోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎమ్‌డి.మదని అధ్యక్షతన జరిగిన సభలో రాము మాట్లాడుతూ సమాజంలో దురాచారాలను రూపుమాపి మంచి సమాజాన్ని నిర్మించాలన్నదే తమ ఆశయమన్నారు. దానిలో భాగంగానే పండుగ సందర్భంగా యువత దుర్వ్యసనాల బారిన పడకుండా ఉండేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామనాన్రు. చాలాకాలంగా ఈ పోటీల విజయవంతానికి చాలామంది నిర్విరామంగా కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రస్తుతం యువత డ్రగ్స్ కబంధ హస్తాల్లో చిక్కుకుందని, వాటి నుండి విముక్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. 'డ్రగ్స్ అంతం- డివైఎఫ్ఐ పంతం' అనేది తమ నినాదమన్నారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారాయ్య మాట్లాడుతూ డివైఎఫ్ఐ 40 సంవత్సరాలుగా చేస్తున్న కృషిని అభినందించారు. సమావేశంలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు బొక్కా సత్యనారాయణ, బి.రాంబాబు, జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, క్రీడాపోటీల కన్వీనర్ డోకల రవితేజ మాట్లాడారు.

ఉత్సాహభరితంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరులో కలిదిండి సూర్యనారాయణ రాజు జన విజ్ఞాన కళావేదిక వద్ద 35వ సంక్రాంతి యువజనోత్సవాలను డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు శనివారం ప్రారంభించారు. మానసిక ఉల్లాసానికి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో, ఐద్వా జిల్లా అధ్యక్షులు కేతా పద్మజ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, గ్రామ 13 ,14 వార్డ్ మెంబర్లు సిహెచ్.గురుప్రసాద్, సిహెచ్.సత్యనారాయణ, డివైఎఫ్ఐ గ్రామ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, ఫణీంద్ర, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

ఆచంట : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆచంట ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ యువతకు పిలుపునిచ్చారు. పెనుమంచిలి గ్రామం వర్ధనపు గరువు అంబేద్కర్ సర్కిల్ వద్ద శనివారం భారత ప్రజాతంత్ర యువజన సమైక్య, జైభీమ్ సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి ఆటల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు, పల్లెల్లో కాయకష్టం చేసుకుని కుటుంబ పోషణ చేసుకుంటున్న రైతులు, వ్యవసాయ కార్మికులు, యువకులు చట్ట వ్యతిరేకమైన పేకాట, గుండాట, కోడి పందేలు వంటి జూద క్రీడల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడేవిధంగా తయారవుతున్నాయని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల విష సంస్కృతి పాకిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మత్తు పదార్థాల జోలికి పోకుండా దేహ దారుఢ్యం, మానసిక ఉత్తేజం పెంపొందించే గ్రామీణ క్రీడలను అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. ముగ్గులు, కుండ కొట్టుడు, కుస్తీ పోటీలు, మ్యూజికల్ ఛైర్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ మండల నాయకులు వద్దిపర్తి అంజిబాబు, కుసుమే జయరాజు, ఆటల పోటీల నిర్వాహకులు జై భీమ్ సంస్థ నాయకులు సిర్రా నర్సింహమూర్తి, వర్ధనపు హరికృష్ణ, అల్లూరి చిన్నారావు, విశ్రాంత ఉపాధ్యాయులు వి.నాగేశ్వరరావు, సిర్రా విఘ్నేశ్వరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు, స్నేహితులు ఇతర బంధువులు అంతా గ్రామాలకు రావడంతో ఉల్లాసభరితంగా భోగి పండుగను చేసుకున్నారు. మహిళలు ఇంటి ముంగిట రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. భోగి పండుగ సందర్భంగా తమ తమ ఇళ్ల ముందు భోగిమంటలు వేసుకున్నారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. మండలంలో ప్రసిద్ధిగాంచిన రామేశ్వర స్వామి ఆలయం భక్తితో కిటకిటలాడాయి.

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామం అరుంధతీపేటలో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్, కుండ కొట్టుడు, రన్నింగ్ వంటి ఆటలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు సరిపల్లి జయప్రభ మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా చించినాడ గ్రామంలో ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, వీటికి సహాయ సహకారాలు అందిస్తున్న వారందరికీ ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సెట్టిమి నాగమణి, జయశ్రీ, కానేటి ప్రియాంక పాల్గొన్నారు.


పెనుమంట్రలో...

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సిబ్బందికి ముగ్గులపోటీ, స్కిప్పింగ్, రన్నింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ విత్ స్పూన్ ఆటలు నిర్వహించినట్లు డిపో మేనేజర్ యేలూరి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. విజేతలకు డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ పి.అవినాష్, డాక్టర్ అవిదీప్ చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య, సురేష్, భీమయ్య, రమణ, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, డివి.కుమార్, ఎంవి.కృష్ణ, పివి.పైడయ్య సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను మంత్రి స్వయంగా తిలకించారు. ఈ పోటీల్లో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు మంత్రి కారుమూరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అన్నారు. మహిళల కోసం ఇంత పెద్దఎత్తున ఆలోచించిన ప్రభుత్వం ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తణుకులో...

భీమవరం రూరల్ : భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఇంట సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యుల మధ్య ఈ సంబరాలు జరుగగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, ఆయన సోదరులు బాలాజీ, చల్లారావులు తెల్లవారుజామున భోగిమంట వెలిగించారు. అనంతరం మురళి కోలాటాన్ని, గంగిరెద్దుల విన్యాసాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో కూడా వెలుగు నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలని, తద్వారా సమాజం అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. తెలుగు నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నేతలకు, అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నరసాపురం : కోడిపందేలకు, జూద క్రీడలకు యువత దూరంగా ఉండాలని తహశీల్దార్ మౌలాలి ఫజిల్ పిలుపునిచ్చారు. సంక్రాంతి పురస్కరించుకుని వేములదీవి గ్రామంలో సంక్రాంతి సంబరాలను నరసాపురం తహశీల్దార్ ప్రారంభించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కౌరు పెద్దిరాజు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సంక్రాంతి వంటి పండుగ రోజుల్లో యువత కోడిపందేలు, జూదం, మద్యం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడానికి ఆటల పోటీలు సాంస్కృతిక, విజ్ఞాన, వినోద కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ వేములదీవి గ్రామంలో జనవరి 14 నుంచి 19 వరకు నిర్వహించనున్న విద్యార్థి, యువజనోత్సవాల్లో విద్యార్థులు, యువత పాల్గొనాలని కోరారు. క్రికెట్, చెడుగుడు, వాలీబాల్ ముగ్గుల పోటీలు వంటి పలు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృపరాజు, డివైఎఫ్ఐ మాజీ అధ్యక్షులు కోరు పెద్దరాజు, డివైఎఫ్ఐ గ్రామ నాయకులు కౌరు శ్రీనివాసరావు, బొక్క హనుమంతు, బొక్కా గుణ నాగ దుర్గారావు, కేతా నాగాంజనేయులు, కవురు శివ గణేష్, మామిడిశెట్టి నాగవెంకటప్రసాద్, బాబి, బొక్కా సాయి శ్రీను పాల్గొన్నారు.

నరసాపురంలో...

కాళ్ల : మండల పరిధిలో కాళ్ల, కాళ్లకూరు, కోపల్లె, జువ్వలపాలెం, ఏలూరుపాడు, సీసలి, దొడ్డనపూడి, కలవపూడి, మాలవానితిప్ప తదితర గ్రామాల్లో శనివారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి భోగి సామగ్రిని సిద్ధం చేసి శనివారం తెల్లవారుజామునుంచి భోగి మంటలను వెలిగించారు. యువతీ, యువకులు, చిన్న పిల్లలు భోగి మంటలు వేసేందుకు ఆసక్తి చూపారు.

తాడేపల్లిగూడెం : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు, బాల, బాలికలకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ నవాబుపాలెం గ్రామంలో గత 36 సంవత్సరాలుగా ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇది 36వ వార్షికోత్సవమని తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పెద్దలను అభినందించారు. చెడు సంస్కృతిక వ్యతిరేకంగా ఆటల పోటీలు నిర్వహించడం యువతని సన్మార్గంలో నడిపించడమే నన్నారు. ఈ సందర్భంగా జరిగిన ముగ్గుల పోటీల్లో ధూళిపాల ఉదయ ప్రథమ స్థానం, కామేశ్వరి ద్వితీయ స్థానం, దోసపూడి నాగజ్యోతి తృతీయ స్థానం, పరుగుల పోటీల్లో రావాడ రాజేశ్వర్, సీనియర్స్ బాలికల పోటీలో శాంతకుమారి ప్రథమ స్థానం, టి.పూజ రెండో స్థానం, జూనియర్ బాలికల్లో ఉప్పలపాటి హేమ ప్రథమ స్థానం, డి.ప్రసన్న రెండో స్థానం, బాలురులో శీలి శ్రీనివాస మొదటి స్థానం, డి.ఎస్సెన్ రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు గ్రామ సర్పంచి దంపతులు మద్దుకూరి గంగాభవాని, ధనరాజు, బత్తుల రాంబాబు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు, మహిళా సంఘం నాయకులు కండెల్లి కమల కుమారి, కె.విజయ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు సారథ్యంలో బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సంబరాల ముగింపు సందర్భంగా భారీ ఎత్తున ప్రజలు సంక్రాంతి సంబరాలు చూసేందుకు విచ్చేశారు. తెలుగుజాతి సంస్కృతి సాంప్రదాయాలతో పాటు గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా వివిధ గ్రామీణ అందాలను అలరించారు. వివిధ రకాల పిండివంటలు, పాటలు, జానపద నృత్యాలు, గంగిరెద్దులు, సన్నాయిలు,హరిదాసు కీర్తనలు, భోగిమంటలు, బొమ్మల కొలువులు, కోలాటాలు వంటి పల్లె కళారూపాలతో మైదానం ఆకర్షణంగా నిలిచింది. పెద్ద ఎత్తున సెల్ఫీలు దిగుతూ యువత ఆనందించారు. పలువురు టిడిపి నేతలు పంచెకట్టు కట్టి సాంప్రదాయ గ్రామీణ వాతావరణ డ్రస్సులు వేసుకుంటూ పలువురిని ఆకర్షించారు.

పాలకొల్లు బిఆర్ఎంబి హై స్కూల్ గ్రౌండ్‌లో ఎంఎల్‌ఎ కప్ రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల వాలీబాల్ టోర్నమెంట్స్ ఫైనల్ శనివారం రాత్రి పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లా జట్ల మధ్య ఆసక్తికరంగా జరిగింది. మ్యాచ్ చూసేందుకు భారీ ఎత్తున ప్రజలు వచ్చారు. ఈ టోర్నమెంట్స్ ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు సారథ్యంలో నిర్వహిస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు రజతం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 నెట్‌బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు రజత పతకం సాధించిందని జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్ సెక్రటరీ జయరాజ్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో భీమవరం బ్రౌనింగ్ కళాశాల నుంచి జె.వాసంతి, పి.శాంభవి, సిహెచ్.ప్రతిమ, ఎం.లిల్లీప్రియా, కె.తేజేశ్వరి, డాక్టర్ సిఎస్ఎన్ కళాశాల నుంచి కె.భారతి, షేక్ షీమ, జి.శిరీష, పి.రామశిరీష, డాక్టర్ అంబేద్కర్ గురుకులం కళాశాల నుంచి ఎ.రంజిత, రాయకుదురు జెడ్‌పి పాఠశాల నుంచి వి.దేవి జిల్లా విజయంలో కీలక పాత్ర పోషించి రజత పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించారని జిల్లా నెట్ బాల్ కోచ్ పి.సాయిదావుద్ తెలిపారు. ఎస్.విజయలక్ష్మికుమార్, జి.విజయ్‌కుమార్, పల్లవిలు కోచ్ మేనేజర్‌గా వ్యవహరించి విజయంలో కృషి చేశారు. బ్రౌనింగ్ కళాశాల నుంచి జె.వాసంతి, డాక్టర్ సిఎస్ఎన్ కళాశాల నుంచి కె.భారతి, షేక్ షీమ స్టాండ్ బై బాలుర విభాగంలో బ్రౌనింగ్ కళాశాల విద్యార్థి ఆర్.సంజయ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయం సాధించిన జట్టును బ్రౌనింగ్ కళాశాల అధినేత మేడిద జాన్సన్, ప్రిన్సిపల్ రంప ఎలిషా, సిఎస్ఎన్ కళాశాల అధినేత చీడే సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్, పలువురు ఉపాధ్యాయులు, జిల్లా అండర్ -19 స్కూల్ గేమ్ సెక్రటరీలు కె.జయరాజ్, కుమార్ అభినందించారు.

ఘనంగా గోదా రంగనాధుని కళ్యాణం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదారంగనాధుని కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ధనుర్మాసంలో భోగి రోజున గోదారంగనాధుని కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు యాత్రికులు పెద్ద ఎత్తున విచ్చేశారు. మద్దాలి తిరుమల వెంకటేశ్వర్లు దంపతులు, ఆండాళ్ గోష్ఠి చేతులమీదుగా గోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవమునకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు దండు వెంకటకృష్ణంరాజు, ధర్మకర్తల మండల సభ్యులు దేవస్థానం కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు తగిన ఏర్పాట్లు చేశారు.


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న శివరామరాజు

నిరాశ్రయులకు అండగా ఉంటా : శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

నిరాశ్రయులకు అండగా ఉంటానని శివ స్వచ్ఛంద సేవ సంస్థ అధినేత వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మండలంలోని ఉప్పులూరులో రెండు తాటాకిళ్లు దగ్ధమైన సంఘటనలో నిరాశ్రయులైన వారిని ఉండి మాజీ శాసనసభ్యులు, శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత వేటుకూరి వెంకట శివరామరాజు శనివారం పరామర్శించి రూ.పది వేల నగదు, 50 కేజీల బియ్యం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులైన బాధితులకు తన సంస్థ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ ప్రమాదం జరగడంతో పక్క ఇళ్ల వారి మీటర్లు కాలిపోయాయని శివ రామరాజు దృష్టికి మహిళలు తీసుకురాగా వెంటనే ఆయన లైన్‌మెన్‌తో మాట్లాడి కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. శివరామరాజుతో పాటు టిడిపి నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, బురిడి రవిబాబు, యర్రా చిట్టిబాబు, దవిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'జగన్ అవకాశమిస్తే ఎంఎల్‌ఎగా పోటీ చేస్తా'

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాట్లాడుతున్న కాశీవిశ్వేశ్వర్‌రెడ్డి

జగన్ అవకాశమిస్తే నియోజకవర్గ ఎంఎల్‌ఎగా పోటీ చేస్తానని రాజమహేంద్రవరం విద్యా సంస్థల ఛైర్మన్ తేతలి కాశీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శని వారం ఆయన స్వగ్రామమైన పెనుమంట్రకు విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోస్తనీ నది తణుకు షుగర్ ఫ్యాక్టరీ కారణంగా కలుషితమవుతోందన్నారు. నది ప్రక్షాళనకు ప్రయత్నిస్తున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల జరగలేదన్నారు. గోదావరిలో ప్రవహించే నది జలమంతా రాజమండ్రి నుంచి ఏడు లక్షల మంది వాడుతున్న వ్యర్థంతో కలుషితమైందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడానని చెప్పారు. వైవి.సుబ్బారావు, సజ్జల రామకృష్ణతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. ఇంతటి స్థాయికి చేరుకున్న తాను భవిష్యత్తులో గ్రామానికి సేవ చేయాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఎంఎల్‌ఎ రంగనాధరాజు ఇక్కడ పోటీలో లేకపోతే తాను ఎంఎల్‌ఎగా పోటీ చేస్తానన్నారు. ఒకవేళ రంగనాధరాజు పోటీలో ఉంటే ఆయనకు తన మద్దతు ఉంటుందని చెప్పారు.

బిసి ఐక్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

రానున్న రోజుల్లో బిసి కమ్యూనిటీ పాలెంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఐక్య సంఘం చర్యలు తీసుకుంటుందని బిసి కులాల ఐక్య సంఘం అధ్యక్షులు బలం వెంకటరమణ తెలిపారు. కొడమంచిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బిసి కులాల ఐక్య సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ములగాడ వరప్రసాద్, కొల్లి సాయి, బొక్క ఏసు, సామంతి బాబురావు, కట్ట రామారావు, కాండ్రేగుల సత్యనారాయణ, మళ్లీ పెద్ది నాగరాజు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో హెల్త్ అసిస్టెంట్ ఆత్మహత్య

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర పిహెచ్‌సిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెలగల శరత్ చంద్రారెడ్డి(53) అనారోగ్య కారణాలతో శనివారం ఆసుపత్రిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు ఇటీవల వివాహం చేశారు. ఆయన స్వగ్రామం ఉండ్రాజవరం అయినప్పటికీ మార్టేరులో నివాసం ఉంటున్నారు. గత పది సంవత్సరాలుగా ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నా అందరితో సరదాగా ఉంటూ విధులు నిర్వహించేవారు. శనివారం ఉదయం ఆసుపత్రిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.సురేంద్రకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యథేచ్ఛగా కోడిపందేలు.. పత్తాలేని పోలీసులు..!

భీమవరంలో కోడిపందేలు చూసేందుకు వచ్చిన కిరణ్ అబ్బవరం

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని శృంగవృక్షం, విస్సాకోడేరు, పాలకోడేరు, గొల్లలకోడేరు, కోరుకొల్లు, కొండేపూడి, కొమ్మదవల్లి గ్రామాల్లో 11 బరుల్లో కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహించారు. పందేలకు ఒక్కరోజు ముందు వరకు గ్రామస్థాయి, మండల స్థాయిల్లో సదస్సులు నిర్వహించినప్పటికీ భోగి రోజున అనధికారిక ఒప్పందాలతో కోడి పందేలు, జూద క్రీడలు భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో అధికారి యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన వైసిపి నాయకులు పందేలు నిర్వహించారు. మరికొన్ని గ్రామాల్లో టిడిపి, వైసిపి పోటాపోటీగా పందేలు వేశారు. పందేలు నిర్వహించేది ఒకరైతే కేసులను అమాయకులపై నమోదు చేస్తున్నారని పోలీసులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు గతంలో బైండోవర్ చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసే విధంగా టార్గెట్లు పెట్టడంతో పోలీసులు బరులు చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బరుల వద్ద పేకాట, గుండాట ఆటలు భారీగా సాగాయి. మద్యం అమ్మకాలు కూడా జరిగాయి.

కాళ్ల : ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందేలు జరగనివ్వబోమని హెచ్చరించిన అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల ముందు తలవంచింది. బైండోవర్లు, అవగాహన సదస్సులు, బరుల ధ్వంసం చేసిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పండగరోజు మాత్రం మిన్నకుండిపోయారు. ఫలితంగా తొలి రోజే కాళ్ల మండలంలో సుమారు రూ.కోట్ల వరకు నగదు చేతులు మారినట్లు సమాచారం. సీసలిలో రూ.6 లక్షల పందెం జరిగింది. పెదఅమిరం, జక్కరం, కాళ్ల, కాళ్లకూరు, మాలవానితిప్ప, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. ఈ కోడిపందేలకు తెలంగాణ నుంచి పక్క రాష్ట్రాల నలుమూలల నుంచి జనం భారీగా తరలివచ్చారు. టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాంబశివరాజు, మాజీ సర్పంచి శివరామరాజు పాల్గొన్నారు.

ఆంధ్రుల పెద్ద పండుగ సంక్రాంతి : ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

సీసలి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడిపందేలను ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల, రాష్ట్రాల నుంచి గ్రామాలకు విచ్చేసిన ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయ కోడిపందేలను తిలకించడానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు మాట్లాడుతూ దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమంలో పాలు పంచుకోవడం దాతృత్వంతో గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేయడం శుభసూచికమన్నారు.

ఆచంట : సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఆచంట, వల్లూరు గ్రామాల్లో జోరుగా కోడిపందేలు, గుండాట నిర్వహించారు.

పెనుమంట్ర : సంక్రాంతి పండుగ నేపథ్యంలో శనివారం భోగి రోజున మండలంలో కోడిపందేలు జోరుగా నిర్వహించారు. మండలంలోని గరువు, మాముడూరు, నత్తా రామేశ్వరం, ఆలమూరు, జుత్తిగ గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. వాటి ప్రాంగణంలోనే గుండాట, మద్యం భారీగా అమ్మకాలు జరుగుతున్నాయి.

వీరవాసరం : మండలంలో సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. వీటితో పాటు గుండాట కూడా నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముందు నుండి హెచ్చరించిన పోలీసులు పట్టించుకోవడంలేదు. వీరవాసరం, కొణితివాడ, నవుడూరు, రాయకుదురుల్లో కోడి పందేలు జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే విధంగా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పూలపల్లి, శివదేవుని చిక్కాల, దగ్గులూరు, వడ్లవానిపాలెం, లంకలకోడేరు, దిగమర్రు ప్రాంతాల్లో ప్రయివేట్ సెక్యూరిటీ మధ్య కోడిపందేలు నిర్వహించారు. ఈ అసాంఘిక కార్యకలాపాలు పాలక పక్షాలు, ప్రతిపక్షాలు కన్ను సన్నల్లోనే జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. కోడిపందేల బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాటలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం మాత్రం కనుచూపు మేరలో కనబడలేదు. పోలీసులు బరులను దున్నించి ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు వద్దే పందేలను నిర్వహించారు. వీక్షించడానికి గ్యాలరీలను ఏర్పాటు చేశారు.


కాళ్లలో తెలంగాణ ఎంఎల్ సమీపుర్ రాజ్, మాజీ మంత్రి మహేంద్రరెడ్డి

పెంటపాడు : మండలంలో కోడిపందేలు రూ.లక్షల్లో జరుగుతున్నాయి. అలంపురం, జడ్లపాలెం, రామచంద్రపురం, పెంటపాడు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కోడిపందేల బరుల వద్ద పేకాట, గుండాట నిర్వహిస్తున్నారు.

భీమవరం రూరల్ : భీమవరంలో నిర్వాహకులు టెంట్లు కాకుండా కోడిపందేలు చూసేందుకు ఆ ప్రాంతంలో స్టేజీలు, ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. శనివారం భోగి సందర్భంగా భీమవరంలో ఇండస్ట్రియల్ ఏరియా, తుందుర్రు, లోసరి, కొవ్వాడ అన్నవరం గ్రామాలతో పాటు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కోడిపందేలు, గుండాట జరిగాయి. ఈ పందేల్లో రూ.లక్షలు చేతులు మారాయి. గొల్లవానితిప్ప రోడ్డు దేగపురములో కోడిపందేలు చూసేందుకు సినీ హీరో కిరణ్ అబ్బవరం వచ్చారు.

ఆకివీడు : మండలంలో కోడిపందేలు, జూదక్రీడలు యథేచ్ఛగా నిర్వహించారు. గత పది రోజుల నుంచి ప్రభుత్వం, అధికారులు భారీ స్థాయిలో ప్రచారం చేసినప్పటికీ సమయం వచ్చేసరికి అధికారులు చేతులెత్తేయడం గమ నార్హం. దుంపగడపలో భారీ స్థాయిలో కోడిపందేలు జరిగాయి. కోడిపందేల బరుల వద్ద గుండాట, జూదాలు జరిగాయి.

రాయల్ ఎన్ఫీల్డ్ బహుమతి

దుంప గడపలో శనివారం ప్రారంభించిన కోడిపందేల్లో ఒక ప్రత్యేక బహుమతిని ప్రకటించడం గమనార్హం. కోడి పందేలు రెండు వర్గాలుగా నిర్వహించినపుడు ఏ వర్గమైన ఐదు పోటీలు గెలిస్తే వారికి రాయల్ ఎన్ఫీల్డ్ బహుమతిగా ఇస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆ మేరకు మోటార్ సైకిల్‌ను అక్కడ బహిరంగంగా ప్రదర్శించారు.

కోడిపందేలకు వచ్చిన ప్రముఖులు

కాళ్ల : మండలంలోని సీసలి గ్రామంలో జరిగే కోడిపందేలకు దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర ఎంఎల్‌సి సమీపూర్ రాజు, మాజీ మంత్రి మహేంద్రరెడ్డి విచ్చేసి కోడిపందేలను వీక్షించారు. పందెం రాయుళ్లు నోట్ల కట్టలతో రూ.లక్షల పందెం కాశారు. కోట్ల రూపాయలు చేతులు మారాయి.

యలమంచిలి : మండలంలోని కలగంపూడి, కాజా, కొంతేరు, మేడపాడు, గుంపర్రు, వడ్డీలంక, మట్లపాలెం, బూరుగుపల్లి, పెదలంక, కనకలంక, యలమంచిలి గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడిపందేలు, గుండాట నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిన్నటివరకు హెచ్చరికలు జారీ చేసిన పోలీసు యంత్రాంగం ఎక్కడా కానరాలేదు. గతంలోకంటే ఈసారి పందెం రాయుళ్లు సుదూర ప్రాంతాల నుంచి ఈ ప్రాంతానికి తరలి రావడంతో రహదారులు కిక్కిరిసిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి రోజే రూ.కోట్లు పందెం రాయుళ్ల చేతులు మారినట్లు పలువురు చెబుతున్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు భారీగా నిర్వహించారు. మండల కేంద్రమైన మొగల్తూరులో, కెపి.పాలెం, పేరుపాలెం, ముత్యాలపల్లి, వారతిప్ప, కాళీపట్నం, జగన్నాథపురం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేల్లో రూ.లక్షలు చేతులు మారాయి. బరుల వద్ద పదెంరాయుళ్ల కోసం శీతల పానీయ దుకాణాలు, పలవు సెంటర్లు నెలకొల్పారు.

పాలకొల్లు : ప్రముఖ కాసినో ఆటగాడు సీకోటి ప్రవీణ్ యలమంచిలి మండలంలోని కలగంపూడి కోడిపందేల బరిని శనివారం సందర్శించారు. వైసిపి యలమంచిలి మండల కన్వీనర్ పోతూరి బుచ్చిరాజు ఆయనకు స్వాగతం పలికారు. గోదావరి రుచులను ఆయన ఆరగించారు. ఆయన రాక ఎవరికి తెలియకపోవడంతో గట్టి ప్రయివెట్ సెక్యూరిటీ మధ్య ఆయన పర్యటన సాగింది. అసలు ఎవరు వచ్చారో ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది. ఆయన చుట్టూ గట్టి భద్రత వలయం ఉండటంతో ఆయనకు దగ్గరకు ఎవరు వెళ్లలేకపోయారు.

పాలకొల్లు పట్టణంలో మూడు ప్రధాన బరుల్లో పార్టీ బేధాలు లేకుండా కోడిపందేలు నిర్వహించారు. గుండాట, పేకాట, విచ్చలవిడిగా జరిగి రూ.లక్షలు చేతులు మారాయి. ఒకపక్క ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు సంక్రాంతి సందర్భంగా సంక్రాంతి సంబరాలు, రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. టిడిపి, వైసిపి బేధాలు లేకుండా ఉమ్మడిగా పాలకొల్లులో కోడిపందేల పేరుతో జూదం జాతర జరిగింది. పాలకొల్లు రూరల్ స్టేషన్ పక్కనే రెండు ప్రధాన బరుల్లో విచ్చలవిడిగా కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించారు.

తాడేపల్లిగూడెం : మండలంలోని కొమ్ముగూడెం, పట్టింపాలెం, బంగారుగూడెం, పెదతాడేపల్లి, జగ్గన్నపేట, మోటుగుంట, అప్పారావుపేట, మారంపల్లి, కొండ్రుప్రోలు, కృష్ణంపాలెం ప్రాంతాల్లో కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహించారు. రెండు రోజుల క్రితం వెంకట్రామన్నగూడెం, ప్రకాశరావుపాలెం గ్రామాల్లోని బరులను పోలీసులు ధ్వంసం చేసి కోడిపందేల నిర్వహణకు అనుమతులు లేవని, నిర్వహిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయ్యినా పందెంరాయుళ్ళ కోడిపందేలు నిర్వహించారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఆచంట గ్రామం మరియు మండలంకు చెందిన గుత్తుల ఏసుబాబు అను నేను వైజాగ్‌లో 15-06-2017లో పొందిన R 2776523 పాస్‌పోర్ట్‌ను 02-01-2023 సోమవారం ఆచంటలోని మెయిన్ సెంటర్లో జిరాక్స్ తీసుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందచేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

గుత్తుల ఏసుబాబు
తండ్రి: వెంకటేశ్వర రావు,
పాత డోర్ నెం. 23-146,
కొత్త డోర్ నెం.23-124/1,
మానే వారిపాలెం, ఆచంట
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెంబర్: 86889 17561

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 21/2022 ఇన్
ఓ.ఎస్.నెం. 162/2010

బిట్వీన్:
గంగుల వెంకటేశ్వరరావు
...డి. హెచ్. ఆర్ /వాది
మరియు
1) జెట్టి సాయిబాబా (డైడ్) వగైరాలు
...జె. డి. ఆర్స్

టు: 4వ రెస్పాండెంటు:
జెట్టి లక్ష్మీనాథ్, తండ్రి: లేటు సాయిబాబా, డో.నెం. 1-19, వీరబ్రహ్మంగారి గుడి దగ్గర, రాయలం, భీమవరం మండలం.

పై నెంబరు ఇ.పి.లో మీకు కోర్టు నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనుటకు నిరాకరించినందున శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.08-02-2022న ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని లేక అడ్వకేట్ ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించుకోవలసిందిగా తెలియజేయడమైనది.** లేనిపక్షంలో మీ పరోక్షమందు శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

జి.వి.స్టీఫెన్ బాబు,
పచ్చిగోళ్ళ రమేష్, అడ్వకేట్స్,
భీమవరం, భీమవరం.
13-1-23. సెల్: 87909 50666